నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, ఆదివారం 5 జనవరి 2025 | NALGONDA

మిషన్ భగీరథ నీటిలో ఫ్లోరైడ్ లేదు

- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు

మర్రిగూడ, జనవరి 4 : మిషన్ భగీరథ పథకం కింద నల్లాల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీటిలో ఫ్లోరైడ్ లేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు శనివారం స్పష్టం చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు గత నెల 19 నుంచి మండలవ్యాప్తంగా వైద్య బృందంతో ఫ్లోరోసిస్‌పై సర్వే చేయించారు. మిషన్ భగీరథ అధికారులు డిసెంబర్ 28న పలు గ్రామాల్లో 23 చోట్ల మిషన్ భగీరథ నల్లాల నుంచి నీటి నమూనాలను సేకరించారు. వాటిని పరీక్షల నిమిత్తం దేవరకొండలోని సబ్ డివిజన్ లెవల్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ లేబొరేటరీకి పంపించారు. పరీక్షల అనంతరం మిషన్ భగీరథ నీళ్లు తాగడానికి శ్రేయస్కరమని, వాటిలో ఫ్లోరైడ్ ఆనవాళ్లు లేవని శుక్రవారం ల్యాబ్ అధికారులు రిపోర్టు ఇచ్చినట్లు ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. లీటర్ నీటిలో ఫ్లోరైడ్ లెవెల్స్ 1.0-1.5 మిల్లీగ్రాములు ఉండాల్సి ఉండగా, అంతకంటే తక్కువగా 0.43మిల్లీగ్రాములు వరకు మాత్రమే ఉన్నట్లు తేలిందని పేర్కొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో కలిసిన ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ నేతలు

కేసీఆర్‌ను కలిసిన జిల్లా నేతలు

నల్లగొండ ప్రతినిధి, జనవరి 4 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆ పార్టీ ఉమ్మడి నల్లగొండ జిల్లా ముఖ్య నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో శనివారం ఎర్రవెల్లి ఫాంహౌస్‌కు వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జడ్పీ మాజీ చైర్మన్లు బండా నరేందర్‌రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్ర కుమార్, గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, గుజ్జ యుగేందర్‌రావు, పాల్వాయి స్రవంతి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, నంద్యాల దయాకర్ రెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నేవూరి ధర్మేందర్‌రెడ్డి, వలమల కృష్ణ, నూకల యుగేందర్ రెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, మారగోని గణేశ్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, మెరుగు గోపి ఉన్నారు.

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

అవకతవకలు లేకుండా డబుల్ బెడ్రూమ్ ఇండ్ల కేటాయింపు

- ఎన్నికల కోడ్ కారణంగా పంపిణీ ఆలస్యం
- గతంలోనే ఇంటి ఓనర్లు అయ్యారు.. ఇప్పుడు నెంబర్ల కేటాయింపు మాత్రమే
- సూర్యాపేటలో అరాచకాలు సాగనివ్వం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి
- లబ్ధిదారులకు డబుల్ బెడ్రూమ్ ఇండ్ల కేటాయింపు

సూర్యాపేట, జనవరి 4 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లను మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి శనివారం లబ్ధిదారులకు కేటాయించారు. అందరి సమక్షంలో చిన్నారులతో లాటరీ తీయించి ఇంటి నెంబర్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ గతేడాది ఎన్నికలకు ముందే డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు యజమానులయ్యారని, ఎన్నికల కోడ్ అడ్డు రావడం, కొన్ని పనులు పూర్తికానందున కేటాయింపు ఆలస్యమైందని తెలిపారు. ప్రస్తుతం పనులన్నీ పూర్తవడంతో లబ్ధిదారులు ఇండ్లను కేటాయించినట్లు చెప్పారు. ఈ క్రమంలో కొద్ది మంది ఆందోళనకు గురయ్యారని, తానుండగా చిన్న అన్యాయం జరుగనివ్వనని తెలిపారు. గతంలో మాదిరిగానే అవకతవకలకు ఆస్కారం లేకుండా కేటాయింపులు జరిగాయన్నారు. సూర్యాపేటలో అరాచకాలను సాగనివ్వనని, ప్రశాంతతకు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదని జగదీశ్‌రెడ్డి స్పష్టంచేశారు. పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. వాస్తవానికి అన్నీ పూర్తయిన తరువాత లాటరీ తీసి గతంలో కేసీఆర్ ఇండ్లను ఎలా ప్రారంభించారో అలాగే ఈసారి కూడా జిల్లా మంత్రితో కలిసి ప్రారంభించుకుందాం అనుకున్నామని, ఈలోపు లబ్ధిదారులు ఆందోళన పడుతున్నారని లాటరీ తీసి ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నామని తెలిపారు. గృహ ప్రవేశాలకు సంబంధించిన తేదీని మాత్ర కలెక్టర్ నిర్ణయిస్తారని చెప్పారు. ఇండ్ల విషయంలో ఎవరికీ అనుమానం అక్కర్లేదని, ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆర్డీఓ వేణుమాధవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, తాసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, కౌన్సిలర్లు కక్కిరేణి శ్రీనివాస్, జ్యోతి కరుణాకర్, తాహేర్‌పాషా పాల్గొన్నారు.

సైన్స్ ఆధారంగానే జీవన విధానంలో మార్పులు

- జిల్లా సైన్స్ ఫెయిర్, ఇన్స్‌స్పైర్ ప్రదర్శన ముగింపులో మండలి చైర్మన్ గుత్తా
- ఉత్తమ ఎగ్జిబిట్లకు బహుమతులు.. రాష్ట్రస్థాయికి ఎంపిక

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

రామగిరి, జనవరి 4 : నేటి ఆధునిక యుగంలో ప్రపంచవ్యాప్తంగా సైన్స్‌కు పోటీ పెరుగుతున్నదని, సైన్స్ ఆధారంగానే జీవన విధానం మారుతున్నదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. వ్యవసాయ రంగంలో సైన్స్ కీలక పాత్ర పోషిస్తున్నదన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నల్లగొండలోని డాన్‌బాస్కో హైస్కూల్ నిర్వహించిన జిల్లా సైన్స్ ఫెయిర్, ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శన ముగింపు కార్యక్రమం శనివారం సాయంత్రం జరిగింది. మండలి చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గతంలో వ్యవసాయం కష్టంగా ఉండేదని, శాస్త్రవేత్తలువి విధ రకాల యంత్ర పరికరాలు, పనిముట్లను కనుక్కోడం వల్లే సులభతరం అయ్యిందని తెలిపారు. నేటి చదువుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఒక సబ్జెక్టుగా మారిందని గుర్తుచేశారు. విద్యార్థులోని సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్‌లు దోహద పడుతాయన్నారు. ప్రదర్శనలో ప్రథమ, ద్వితీ య, ప్రోత్సహక కేటగిరీల్లో ఎంపికైన ప్రాజెక్టుల విద్యార్థులు, గైడ్ టీచర్స్, బీఈడీ ఛాత్రోపాధ్యాయులు, టీచర్స్ ఎగ్జిబిట్స్‌లో ప్రథమ స్థానం సాధించిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. డీఈవో భిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ సీఈఎ నంద్యాల ప్రేమ్‌కరణ్‌రెడ్డి , జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి, డీపీఆర్వో వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, డాన్ బాస్కో స్కూల్ ప్రిన్సిపాల్ బాలశౌరి రెడ్డి, ఎంఈఓ అరుంధతి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి రామచంద్రయ్య, ఎఫ్ఏఓ యుగేందర్‌నాథ్, వివిధ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో జరిగే ప్రదర్శనలో పాల్గొనున్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు ప్రతీక్ ఫౌండేషన్, మంత్రి కోమటిరెడ్డి ఆధ్వర్యంలో నగదు బహుమతి అందిస్తామని ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ ఎంవీ గోనారెడ్డి ప్రకటించారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రదర్శనలు, విద్యార్థులు..

- టీచర్ ఎగ్జిబిట్ – ఆర్.సరస్వతి, జడ్పీహెచ్ఎస్, పుల్లెంల
- ఛాత్రోపాధ్యాయులు– పి.అన్నమ్మ, ఎస్.మౌనిక –అధ్యాపకుడు బొడ్డుపల్లి రామ కృష్ణ– డీవీఎం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, నల్లగొండ
- సైన్స్ సెమినార్ – వై.రాంచరణ్, జడ్పీహెచ్ఎస్, చిన్నమాదారం, కనగల్

ఇన్స్‌స్పైర్ ప్రాజెక్టులు

- సీహెచ్.నితిన్, ఎంపీయూపీఎస్, ఊట్లపల్లి, పెద్దవూర మండలం
- పి.విక్రమ్, మరియాణికేత్, చండూరు
- ఎ.సిరిచందన, టీఎస్ మోడల్ స్కూల్, దేవరకొండ
- బి.రుషిమంత్, జడ్పీహెచ్ఎస్, కొండ్రపోల్
- పి.మేఘన, జడ్పీహెచ్ఎస్, పోచంపల్లి, గుర్రంపోడు మండలం
- సీహెచ్ సాత్విక్, జడ్పీహెచ్ఎస్, కనగల్
- జి.భావని, కేజీబీవీ, చెర్కుపల్లి
- ఆర్.రాంతులసి, శాస్త్ర హైస్కూల్, నల్లగొండ
- కె.చందు, జడ్పీహెచ్ఎస్ బాలికలు, నకిరేకల్
- ఎ.శివతులసి, జడ్పీహెచ్ఎస్, కుర్రంపల్లి

సైన్స్ ఫెయిర్ ప్రాజెక్టులు...

- కె.కార్తీక్, జడ్పీహెచ్ఎస్, కేతేపల్లి
- బి.అంజలి, జీజీహెచ్ఎస్, ఆర్పీ రోడ్, నల్లగొండ
- వి.యశ్వంత్, సాందీప్ స్కూల్, నల్లగొండ
- ఎ.సౌజన్య, ఆల్ఫా హైస్కూల్, త్రిపురారం
- కె.రవితేజ, జడ్పీహెచ్ఎస్, నకిరేకల్
- బి.సాయి వర్షిత్, జడ్పీహెచ్ఎస్, కొండమల్లేపల్లి
- డి.జయంత్, జడ్పీహెచ్ఎస్, బకల్‌వాడీ
- ఎస్.సాయిరాం, టీఎస్ఎంఎస్, తిప్పర్తి
- ఎన్.ప్రవళిక, ఎంపీయూపీఎస్, 12 బెటాలియన్ – ఈ.వంశీకృష్ణ, జడ్పీహెచ్ఎస్, దేవరకొండ
- ఎ.ఎలిషా, జడ్పీహెచ్ఎస్, కేశరాజుపల్లి, తిప్పర్తి మండలం
- ఎస్‌కె.సునీయా, ఆల్ఫా హైస్కూల్, త్రిపురారం మండలం
- డి.రాజు, ఎంపీయూపీఎస్, అనంతారం
- ఎన్.మహేశ్, జీహెచ్ఎస్ బొట్టుగూడ, నల్లగొండ

తెలుగు సాహిత్యంపై యువత పట్టు సాధించాలి

- పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య



సదస్సులో మాట్లాడుతున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య

రామగిరి, జనవరి 4 : నేటి యువత తెలుగు సాహిత్యం చదివి పట్టు సాధించాలని, సాహితీ పరిశోధనలవైపు అడుగులు వేసేలా అధ్యాపకులు ప్రోత్సహించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య అన్నారు. నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో శనివారం తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, ఎంజీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు ఆధ్వర్యంలో 'ప్రొఫెసర్ రవ్వా శ్రీహరి సాహిత్యం–సమాలోచనం' అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. కూరెళ్ల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని పలు ఉదాహరణలతో వివరించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ రవ్వా శ్రీహరి నడిచే నిఘంటువు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు అకాడమీ మాజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.యాదగిరి, ఎంజీ యూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, ప్రముఖ రచయితలు, కవులు డాక్టర్ బెల్లి యాదయ్య, డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు, వెల్దండి శ్రీధర్, కృష్ణ కౌండిన్య, ఎంజీయూ ఓఎస్‌డీ ప్రొఫెసర్ అంజిరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, ఎంజీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రియ, ఎంజీయూ తెలుగు శాఖ అధ్యాపకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, పక్కన జడ్పీ మాజీ చైర్మన్ బండా, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి, భాస్కర్‌రావు, కంచర్ల, కూసుకుంట్ల

అందరికీ రైతు భరోసాపై సీఎం రేవంత్‌రెడ్డే డిక్లరేషన్ ఇవ్వాలి

- రైతుల నుంచి ప్రమాణ పత్రాలు అంటే అవమానించడమే
- భేషరతుగా అందరికీ రైతుభరోసా ఇవ్వాల్సిందే
- కౌలు రైతులకు ఇస్తామన్న హామీ అమలు ఎప్పుడు?
- ఏడాదైనా ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలు ఏది?
- రుణమాఫీ, రైతుభరోసా, బోనస్ లబ్ధిపై వివరాలు వెల్లడించాలి
- రైతుల పక్షాన ప్రభుత్వాన్ని వెంటాడుతాం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, జడ్పీ మాజీ చైర్మన్ బండా, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి, భాస్కర్‌రావు, కంచర్ల, కూసుకుంట్ల

నల్లగొండ ప్రతినిధి, జనవరి 4(నమస్తే తెలంగాణ) : '2023 ఎన్నికల సమయంలో ఇదే రేవంత్‌రెడ్డి.. డిసెంబర్ 3 తర్వాత రైతుబంధు డబ్బులు 5వేలు కాదూ... మేం వస్తే రూ.7,500 ఇస్తాం అన్నాడు. కానీ అధికారంలోకి వచ్చి 400 రోజులు గడుస్తున్నా... నేటికీ రైతుబంధు కాదూ కదా! ఆరు గ్యారంటీలు, 420 హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదు. వానకాలం రైతుబంధుకు ఎగనామం పెట్టి యాసంగిలో ఇస్తామంటున్న రైతు భరోసాకు షరతులు విధించడం దారుణం. రైతుభరోసా కోసం రైతులను ప్రమాణ పత్రాలు అడగడమంటే అవమానించడమే. ప్రమాణ పత్రాలు ఇవ్వాల్సింది రైతులు కాదూ... రేవంత్‌రెడ్డే అందరికీ రైతుభరోసా ఇస్తానని డిక్లరేషన్ ఇవ్వాలి' అని బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రతీ రైతుకూ కాంగ్రెస్ ప్రభుత్వం 17,500 రూపాయల రైతు బంధు డబ్బులు బాకీ పడిందని గుర్తు చేశారు. వానకాలంలో రైతుబంధు ఇవ్వలేదని, ఇప్పుడు పంటలు వేస్తేనే రైతుభరోసా అంటే కుదరదని పేర్కొన్నారు. అందరికీ భేషరతుగా రైతు భరోసా ఇవ్వాల్సిందేనన్నారు. అప్పటివరకు రైతుల పక్షాన పోరాటానికి బీఆర్‌ఎస్ సిద్ధమని స్పష్టంచేశారు. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతామని తెలిపారు. శనివారం నల్లగొండలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఇతర నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు మందడి సైదిరెడ్డి, కటికం సత్తయ్యగౌడ్, చీర పంకజ్‌యాదవ్, బొర్ర సుధాకర్, కేవీ రామారావు, మాలె శరణ్యారెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, మారగోని గణేశ్, కొండూరు సత్యనారాయణ, జమాలొద్దీన్ ఖాద్రీ, లొడంగి గోవర్ధన్, రావుల శ్రీనివాసరెడ్డి, దండెంపల్లి సత్తయ్య, మెరుగు గోపి, అన్వర్ పాషా, జి.జంగయ్య, కంకణాల వెంకట్‌రెడ్డి, దొడ్డి రమేశ్, బొమ్మరబోయిన నాగార్జున, షరీఫ్, కలీ, అవినాశ్, ప్రణీత్ పాల్గొన్నారు.

కోమటిరెడ్డి రాజీనామా చేయాలి

'రేవంత్‌రెడ్డి పాలన రెండో ఏడాదిలో అడుగు పెట్టినా ఒక్క హామీ కూడా అమలు కాలేదు. ఉన్న పథకాల్లో ఒక్కో దానికి పంగనామాలు పెట్టడానికి కుట్రలు చేస్తున్నరు. నాడు చీకట్లో మగ్గిన వ్యవసాయాన్ని పండుగలా మార్చేందుకు కేసీఆర్ కంకణం కట్టుకుని పని చేశారు. 24 గంటల కరెంట్, సాగునీటికి తోడు పెట్టుబడి సాయం ఇచ్చి రైతులు బాగు కోరాడు. వ్యవసాయం బాగుండాలని ఆకాంక్షించారు. రైతుల మేలును ఓర్వలేని కాంగ్రెస్ నేతలు గత ఎన్నికల్లో ఓట్ల కోసం తప్పుడు హామీలు ఇచ్చారు. రైతు భరోసా రూ.7,500 ఇస్తమన్నరు. ఎటూ పోయింది మరీ కాంగ్రెస్ హామీ. పెట్టుబడి సాయాన్ని ఎగొట్టేందుకే రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నడు. రైతులు డిక్లరేషన్ ఎందుకివ్వాలి. రేవంత్‌రెడ్డే ప్రతి రైతుకూ రైతుభరోసా ఇస్తానని డిక్లరేషన్ ఇవ్వాలి. రుణమాఫీ ఇంకా 70 శాతం మందికి కాలేదు. ఇప్పుడు రైతుభరోసా కూడా 30శాతం మందికి ఇచ్చి 70శాతం మందికి ఎగనామం పెట్టేందుకు కుట్రలు చేస్తున్నరు. మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ఎటూ పోయాయి. ఏడాదైనా ఇచ్చేందుకు మనసొస్త లేదా? గెలువగానే నాలుగు వేల పెన్షన్ ఇస్తానని ప్రగల్బాలు పలికిన మంత్రి కోమటిరెడ్డి ఎక్కడ పండుకున్నడు. రేవంత్‌రెడ్డిని ఎందుకు నిలదీస్త లేడు. మాటకు కట్టుబడి ఉండడం చేతగాక పోతే తక్షణమే ఎమ్మెల్యే, మంత్రి పదవులకు కోమటిరెడ్డి రాజీనామా చేయాలి. హామీలు అమలు చేయలేక కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి వంటి నేతలపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు. ప్రజలు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను, నేతలను ఎక్కడికక్కడే నిలదీయాలి.'

-కంచర్ల భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

మళ్లీ దళారీ వ్యవస్థ తెచ్చేందుకే దరఖాస్తులు

'కేసీఆర్ ఇచ్చిన మాదిరిగానే ఎలాంటి షరతులూ లేకుండా రైతు భరోసాను భూమి ఉన్న ప్రతీ రైతుకు ఇవ్వాలి. రైతుభరోసా కోసం దరఖాస్తులు చేసుకోవడం ఎందుకు? రైతుల వివరాలన్నీ ప్రభుత్వం వద్ద ఉన్నాయి. మళ్లీ దరకాస్తుల స్వీకరణ అంటే సమైక్య రాష్ట్రంలోని దళారీ వ్యవస్థను తిరిగి తెరపైకి తేవడమే. గతంలో ఏ ప్రభుత్వ పథకమైనా కాంగ్రెస్ నేతల చేతివాటం లేనిదే ప్రజలకు అందేది కాదు. ఇప్పుడు రైతుభరోసాకు దరఖాస్తుల స్వీకరణ అంటే దళారుల పాలు చేయడమే. భరోసా కావాలంటే కాంగ్రెస్ నేతలను, వీఆర్వోలను సంప్రదించాలా? ఇలాంటి చర్యలతో రైతులను రైతుభరోసాకు దూరం చేయాలని చూస్తే ఊరుకోం. దళారీ వ్యవస్థతో మళ్లీ ప్రజలను, రైతులను ఇబ్బంది పెట్టొద్దు. ప్రతీ రైతుకు రైతుభరోసా ఇవ్వాల్సిందే. అప్పటివరకు ఊరుకునేది లేదు.'

-బండా నరేందర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్

దేశంలోనే దిక్కుమాలిన సీఎం రేవంత్‌రెడ్డి

'కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. కేసీఆర్ సర్కారుపై అసత్యాలు మాట్లాడుతూ రెచ్చగొట్టే ధోరణితో కాలయాపన చేస్తున్నరు. రేవంత్‌రెడ్డి అధికారం కోసం హామీలు ఇస్తూ వాటిని అమలు చేస్తామని దేవుళ్లపై ప్రమాణాలు చేశాడు. ఇప్పుడు హామీలు అమలు చేయకుండా దేవుళ్లకే ఎగనామం పెడుతున్నడు. రైతులు రైతుభరోసా కోసం ప్రమాణ పత్రాలు ఇవ్వాలి అనడం ఎందుకోసం. దేశంలోనే దిక్కుమాలిన సీఎం రేవంత్‌రెడ్డి. అందరినీ మోసం చేయడమే వారి లక్ష్యం. ఏడాది పాలనపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు తప్పుడు కేసులకు పాల్పడుతున్నరు. పాలనపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని గ్రహించే స్థానిక సంస్థల ఎన్నికలకు భయపడుతున్నారు. గ్రామ స్థాయి నుంచి మంత్రుల వరకు దోచుకుతింటున్నరు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిస్తే రేవంత్ రెడ్డి సర్కార్ ఇపుడు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేయడానికి కంకణం కట్టుకున్నది. ప్రజలు అన్నీ గమనిస్తున్నరు. ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ నిలబడుతుంది.'

-చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే

చేతగాక పోతే రాజీనామా చేయాలి

'వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలను సూటిగా ప్రశ్నిస్తున్నా. రాష్ట్ర వ్యాప్తంగా ఏఈఓలు ఉన్నారు. పంటల సాగు సమాచారం వెంటనే తెలుసుకోవచ్చు. రైతుబంధు పథకంలో మంత్రులు సహా అందరూ లబ్ధి పొందిన వాళ్లే. వాళ్లకు తెల్వదా ఎలా అమలు చేయాలో. చిత్తశుద్ధి ఉంటే రైతుభరోసా వెంటనే అందరికీ ఇవ్వచ్చు. కానీ రైతుభరోసాకు ఎగనామం పెట్టి నిర్వీర్యం చేసేందుకే ప్రభుత్వం కుట్రలు చేస్తుంది. నాలుగో విడుత రుణమాఫీ డబ్బులు ఇంకా పడలేదు. రుణమాఫీ కాని వాళ్లు చాలా మంది ఉన్నారు. పథకాలు అమలు చేయలేక కేసీఆర్ నాయకత్వాన్ని కించపర్చాలని చూడడం తగదు. చేతగాకపోతే పదవులకు రాజీనామా చేయాలి. తుమ్మల సహా ఎవ్వరైనా సరే. రైతులను మోసం చేయాలని చూస్తే సహించేది లేదు.'

-నల్లమోతు భాస్కర్‌రావు, మాజీ ఎమ్మెల్యే

ఆంధ్రా సలహాదారులతో పాలన

'కాంగ్రెస్ పార్టీ అబద్దాల పునాదులపై అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలను మోసం చేస్తున్నరు. ప్రజాపాలన అని చెప్పి రాక్షస పాలన సాగిస్తున్నరు. రాష్ట్రంలో ప్రజలందరినీ ఏడిపిస్తున్నరు. కేసీఆర్ హయాంలో రాజులా మారిన రైతులను బిచ్చగాళ్లను చేసేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్రంలో ఆంధ్ర పెత్తనంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతున్నది. అందుకే తెలంగాణకు కాంగ్రెస్ పాలనలో ఒరిగిందేమీ లేదు. 13 మంది ప్రభుత్వ సలహాదారుల్లో 8 మంది ఆంధ్రా ప్రాంతం వాళ్లే ఉండడం మన దౌర్భాగ్యం. నిమ్మగడ్డ రమేశ్‌కుమార్, అనిలా వావిల్లా, రఘునాథరెడ్డి, శ్రీరామ కర్రీ, సూర్యదేవర ప్రసన్నకుమార్, ఆదిత్యదాస్, సి.ఆంజనేయరెడ్డి, శ్రీనివాసరాజు వంటి ఆంధ్ర సలహాదారులతో తెలంగాణకు ఎలా న్యాయం జరుగుతుందో చెప్పాలి. రైతు రుణమాఫీ సగం కూడా ఇవ్వలేదు. రైతు భరోసా అడ్రెస్ లేదు. ఆడలేక మద్దెలు ఓడు అన్నట్లు ఉన్నది రేవంత్ పాలన. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలి. అప్పుడైనా కాంగ్రెస్ ప్రభుత్వం కండ్లు తెరుస్తుందేమో. ప్రజల తరుపున ప్రభుత్వం వెంట పడుతాం. వదిలిపెట్టేది లేదు.'

-కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ఒక్కో రైతుకు రూ. 17,500 బాకీ

'ఆరు గ్యారెంటీలు, 420 హామీలను వంద రోజుల్లో పూర్తి చేస్తామని అధికారంలోకి వచ్చి 400 రోజులు పూర్తి అవుతున్నా ఏవీ అమలు చేయడం లేదు. 2023 డిసెంబర్ 3 తర్వాత రూ.7,500 రైతు భరోసా ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదు. గత ఎన్నికల ముందే కేసీఆర్ యాసంగి రైతుబంధును ఇద్దామని ప్లాన్ చేస్తే అప్పటి కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారు. అవే నిధులను గత యాసంగిలో 5వేల రూపాయల చొప్పన ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. కానీ వానకాలం భరోసాకు ఎగనామం పెట్టారు. ఇప్పుడేమో యాసంగి భరోసాకు కుంటిసాకులు చెప్తున్నారు. ఒక్కో రైతుకు రేవంత్ ప్రభుత్వం రూ.17,500 బాకీ పడింది. ఆనాడు కేసీఆర్ ఆంక్షలు లేకుండా రైతుబంధు ఇచ్చారు. కానీ నేడు రైతులు ప్రమాణ పత్రాలు ఇవ్వాలట. రైతులేమైనా దొంగలా? రైతు బంధుకు ఎగనామం పెట్టేందుకే ఇలాంటి డిక్లరేషన్ల కుట్ర. రైతుబంధు డబ్బుల్లో రూ.22వేల కోట్లు దుర్వినియోగమని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అది నిజమైతే గ్రామాల వారీగా ఆ రైతులెవరో జాబితాలు పెట్టగలరా? పత్తి, మిర్చి, కంది వంటి మెట్ట పంటలు వేసే ప్రాంతాల్లో రెండో పంట వేయడానికి ఆస్కారం ఉండదు. ఇలాంటి వాళ్లందరికీ రైతుభరోసా ఎగొట్టేందుకే ప్రమాణ పత్రాలు తెరపైకి తెస్తున్నారు. రైతు రుణమాఫీ, భరసా, ధాన్యం బోనస్ ఎంత మందికి ఇచ్చారో గ్రామాల వారీగా జాబితాలు పెట్టే దమ్ముందా ఈ ప్రభుత్వానికి? రైతులను మోసం చేయాలని చూస్తే ప్రభుత్వంపై పోరాటానికి బీఆర్‌ఎస్ పుడూ సిద్ధమే.'

-ఆర్.రవీంద్రకుమార్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

మూడో పంటకూ అన్నారు.. ఒక్క పంటకే దిక్కులేదు

'హామీల అమలులో పూర్తిగా వైఫల్యం చెందారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలన్న గొప్ప ఆశయంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధుకు శ్రీకారం చుట్టారు. అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రతి పైసా రైతుకు చెందేలా సక్రమంగా అమలు చేశారు. ఇలాంటి పథకంపై రేవంత్‌రెడ్డి తప్పుడు హామీలు ఇస్తూ ఎకరాకు సీజన్‌కు రూ.7,500 ఇస్తామని ఎన్నికల్లో చెప్పారు. రెండు పంటలకు కాదూ.. మూడో పంటకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించారు. అప్పుడు మూడో పంటకు కూడా రైతుబంధు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒక్క పంటకూ ఎందుకు ఇవ్వడం లేదు. వానకాలం రైతుభరోసా ఎగొట్టాడు. యాసంగిలో కొందరికే అంటున్నారు. ఏదో రకంగా రైతులకు భరోసా ఇవ్వకుండా కుట్రలు చేస్తున్నరు. మూడు పంటలకు ఏమో గానీ కాంగ్రెస్ హయాంలో ఒక్క పంటకు దిక్కు లేదు. కొవిడ్ కష్టకాలంలో సైతం కేసీఆర్ రైతుబంధు ఆపకుండా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతులను మోసం చేసేలా వ్యవహరిస్తున్నది. కౌలు రైతులకు ఎప్పుడిస్తారు. రైతులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుంది.'

-ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్సీ